www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 29 మార్చి 2023

5

పశ్చిమ గోదావరి



ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జూనియర్ ఇంటర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఆఖరిరోజు రసాయన శాస్త్రం, కామర్స్-1 పరీక్ష జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో 34,303 మంది విద్యార్థులకు 32,448 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 12631 మంది విద్యార్థులకు 11808 మంది హాజరయ్యారు. 823 మంది గైర్హాజరవ్వగా 93 శాతం హాజరయ్యారు. 11452 మంది జనరల్ విద్యార్థులకు 10929 మంది హాజరయ్యారు. 1179 మంది ఒకేషనల్ విద్యార్థులకు 879 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 16824 మంది జనరల్ విద్యార్థులకు 16092 మంది, 1073 మంది ఒకేషనల్ విద్యార్థులకు 916 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4281 మంది జనరల్ విద్యార్థులకు 4113 మంది, 564 ఒకేషనల్ విద్యార్థులకు 435 మంది హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం హాజరు నమోదైంది.

అంబేద్కర్‌కు అవమానం

ముద్దాపురం పాఠశాలలోని విగ్రహం ధ్వంసం - తల తొలగించి చెరువులో వేసిన దుండగలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మండలంలోని ముద్దాపురంని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాల-1 ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం తలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వేరు చేశారు. తొలగించిన తల భాగాన్ని పక్కనే ఉన్న చెరువులో పడేశారు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తణుకు టౌన్, రూరల్ సిఐలు సత్యనారాయణ, ఆంజనేయులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది.

ఈ ఘటనతో గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. పాఠశాలలో టెంటు వేసి విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ యువకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. గత సంవత్సరం పాఠశాలలో యువత ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో కూడా అంబేద్కర్ బ్యానర్‌ను చింపివేశారని, వారే ఇప్పుడు కూడా ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు, టిడిపి మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించి తద్వారా లబ్ధిపొందాలని కొన్ని దుష్టశక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని, కుల విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన వెనుక ఉన్నవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడి, ఈ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడుల్లో భాగమేనన్నారు. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు చుక్కా సాయిబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు అబ్బదాసరి లాజర్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. నిందితులను త్వరలోనే గుర్తిస్తామని, క్లూస్ టీం వివరాలు సేకరిస్తుందన్నారు. సమగ్ర దర్యాప్తు చేసి త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన అంబేద్కర్ విగ్రహం

చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. మంగళవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను మారంపల్లిలో ఉపాధి కూలీలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందని, ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకమైందని, సంపద సృష్టికర్తలకు అన్యాయం చేసి సంపదను దోచుకునే వాళ్లకు వత్తాసు పలికే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని విమర్శించారు. వీటిని వ్యతిరేకిస్తూ చలో ఢిల్లీకి పిలుపునిచ్చారన్నారు. అధిక ధరలను అరికట్టి, ఆహార నిత్యావసరాలపై జిఎస్‌టిని సవరించి, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ పన్ను గణనీయంగా తగ్గించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను అందుబాటులో తెచ్చి 14 రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, అందరికీ గృహ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఈశ్వర్, డి.సత్యవతి పాల్గొన్నారు.

ఆచంట : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఆచంటలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపర్తి అంజిబాబు, రైతు సంఘం నాయకులు, బొక్కా సూర్యనారాయణ, తలుపురి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సామంతకూరి శ్రీనివాస్, బండారి ఏసు, కొత్తపల్లి మల్లి, ఇంటి సురేష్, చిక్కాల బాబు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

ఓపెన్ స్కూల్ ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓపెన్ స్కూల్ ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణపై కలెక్టరు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి సమీక్షించారు. ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణలో మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్, ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షకు, ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి పరీక్షలకు మధ్యాహ్నం 2.30 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. పరీక్ష హాల్లోకి 45 నిమిషాలు ముందు నుండే అనుమతిస్తామని డిఆర్ఒ తెలిపారు. పరీక్షల నిర్వహణ అంతా సిసి టీవీలతో పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ప్రతీపరీక్ష కేంద్రం వద్ద హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధిస్తామని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షల సమయంలో మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 2135 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. తొమ్మిది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, తొమ్మిది మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 111 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నాపత్రాలు భద్రపరిచేందుకు, పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని, సిబ్బందికి విధుల ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 846 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలు నిర్వహణకు ఐదు పరీక్షా కేంద్రాలు, నాలుగు స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, 46 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఎవి.సుబ్బరాజు, జిల్లా విద్యా శాఖాధికారి ఆర్.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఉద్యమం

ప్రజాశక్తి - భీమవరం

ఉప్పు సత్యాగ్రహం ఉద్యమానికి నాంది పలికిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమిస్తామని కలెక్టరేట్ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన నిరసన మంగళవారానికి 20వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ పరిపాలన విధానంలో కీలక పాత్ర పోషిస్తున్న తమపట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. తమ వ్యక్తిగత జీవన విధానంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ప్రభుత్వం తీసుకున్న లక్ష్యాలను చెరువ చేసి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తున్నామన్నారు. అలాంటి తమపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, సిహెచ్.రవికుమార్, నిజాముద్దీన్ షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, జి.కళ్యాణి, పి.గౌతమీ, పివి.సాంబశివరావు, కె.సురేష్, డిటి సూర్యనారాయణరాజు, జూనియర్ సహాయకులు, దివ్య స్మయిలీ, సాయి, జీవన్, సుభాష్, రమ, సిబ్బంది బుజ్జియ్య, సూర్యకాంతం, అనురాధ, మురళీ, సత్య నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు నష్టదాయకమైన టెండర్ విధానం రద్దు చేయాలి


ప్రజాశక్తి - తణుకు రూరల్

కార్మికులకు నష్టం కలిగించే టెండర్ విధానాన్ని రద్దు చేయాలని వివిధ వామపక్ష, రాజకీయ పార్టీల, కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఎపి సీడ్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అక్రమ టెండర్ విధానం రద్దు చేయాలని, పాతపద్ధతిలో కార్మికులను కొనసాగించాలని, కక్ష సాధింపు చర్యలు ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ, టిడిపి నాయకులు గండి రామకృష్ణ, జనసేన నాయకులు అనుకుల రమేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌర హక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, వాన్‌బరి యూనియన్ కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, పట్టణ పౌర సమాఖ్య నాయకులు గార రంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, ఎ.అజయకుమారి మాట్లాడుతూ ఎపి సీడ్స్ అధికారులు చేపట్టిన టెండర్ విధానం సరికాదన్నారు. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఏకపక్షంగా చెప్పుడు మాటలు విని కార్మికుల పొట్ట కొట్టడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. హమాలీ కార్మికులపై రాజకీయ కక్షతో వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇలాంటి విధానాలకు గుణపాఠం చెప్పే రోజు వస్తుందని వారు హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుబ్బల గోపి, రమణ, బాలాజీ, సూరిబాబు, సత్యనారాయణ, వరలక్ష్మి, సాంబశివరావు, త్రిమూర్తులు, రమణ, రూతమ్మ, సత్యవతి, గోవిందరాజు పాల్గొన్నారు.

గేట్‌లో మెరిసిన ఎపి నిట్ విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) పరీక్షా ఫలితాల్లో ఎపి నిట్ విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న బొలిశెట్టి మణికంఠ సూడాల్ (సివిల్)2, డి.సాయివెంకట్ (బయోటెక్నాలజీ) 13, ఒరుగంటి రోహిత్ (ఇసిఇ) 21, లుబుహిత్ బీషేన్(సివిల్)83, రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి (బయోటెక్నాలజీ) 93వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. గేట్ పరీక్షలో మొత్తం వంద మంది అర్హత సాధించగా వీరిలో వందలోపు ర్యాంకులను ఐదుగురు, వెయ్యిలోపు ర్యాంకులను 20 మంది విద్యార్థులు పొందారు. విభాగాలవారీగా బయో టెక్నాలజీలో ఎనిమిది, సివిల్‌లో 20, సిఎస్‌ఇలో ఎనిమిది, ఇఇఇలో 16 ఇసిఇలో 20, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పది, కెమికల్ ఇంజనీరింగ్‌లో తొమ్మిది, ఎంఎంఇలో తొమ్మిది మంది చొప్పున ఉన్నారు. వీరిని డీన్ అకాడమిక్ డాక్టర్ టి.కురుమయ్య మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఛైర్మన్ డాక్టర్ వినోద్‌కుమార్ రాజా మాట్లాడుతూ సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు 2018 నుంచి ఏటా ఉచితంగా గేట్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ర్యాంకులు పొందినవారిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించి సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరామ్, విభాగాధిపతులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.భరణి ధరణ్, డాక్టర్ టి.జగన్‌మోహనరావు, డాక్టర్ బాబూరావు, డాక్టర్ సునీల్, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

పేదల ఇళ్లు, దుకాణాల తొలగింపు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణ సుందరీకరణ పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు, చిరువ్యాపారుల, వృత్తిదారుల దుకాణాలను ప్రభుత్వం, అధికార యంత్రాంగం దౌర్జన్యంగా తొలగించడం అన్యాయమని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లంకపేట మెయిన్ రోడ్‌లో పేదల ఇళ్లు, చిన్న దుకాణాలను యంత్రాలతో బలవంతంగా తొలగించి వారిని తీవ్రంగా నష్టపెట్టడం అన్యాయమన్నారు. పేదల ప్రభుత్వమని చెప్పుకుంటూ పేదల గూడు, ఉపాధి దెబ్బతీయడం దారుణమన్నారు. దౌర్జన్యంగా తొలగించిన ఇళ్లకు, చిన్న దుకాణదారులు, వృత్తిదారులకు తక్షణం ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అనువైన చోట దుకాణాలకు, వృత్తులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని కోరారు. గతంలో తొలగించిన వారికి నేటికి అనేకమందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముదునూరి ప్రసాదరాజు పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో శివారు ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలతో చెరువుల్లో వ్యర్థాలు తొలగించి చెరువులను, మంచినీటి ట్యాంకులను పూర్తిగా నింపాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా పలు పనులకు శ్రీకారం చుట్టేందుకు సంకల్పించామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి బి.రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఆర్‌వి.రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు పాల్గొన్నారు.

మొగల్తూరు : రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అన్ని చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మంగళవారం మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి అందే సూర్యావతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. కెపిపాలెంలో చెరువు నింపేందుకు ప్రధాన కాలువ నుండి పంపింగ్ మెనూ పైపులైను నిర్మాణానికి రూ.70 లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. వారతిప్ప, వెంప రహదారి మరమ్మతుల నిమిత్తం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయతీల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ప్రసాదరాజు ఆదేశించారు. ఈ సమావేశానికి ముగ్గురు ఎంపిటిసిలు, 13 మంది సర్పంచులు గైర్హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వాలని ఎంపిడిఒ ఆనంద్ కుమార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

రీసర్వే పనులు త్వరగా పూర్తిచేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఆకివీడు

రీసర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం మండలంలోని తరటావ గ్రామంలో రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి పనులు వేగవంతం చేయాలన్నారు. రీ సర్వే పనులు వెనుకబడుతున్నాయన్నారు. సర్వేలో భాగంగా ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు జిరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు, టెక్నికల్ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆమె స్థానిక కార్తికేయ జూనియర్ కాలేజీ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మౌలిక సదుపాయాలను, మెడికల్ క్యాంపును పరిశీలించారు. కలెక్టరు వెంట తహాశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ శ్రీకర్, సర్వే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అన్ని భూములూ ఒకేసారి రీసర్వే చేయాలి

భీమవరం: వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలు ఒకేసారి రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆకివీడు మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆకివీడు మండలంలో జరుగుతున్న రీ సర్వేపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే పనులపై ప్రతీరోజు సర్వేయర్, విఆర్‌ఒలు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూటింగ్ నోటీసులు, గ్రౌండ్ వెలిడేషన్ నోటీసులు విధిగా అందజేయాలని, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని దాని ప్రకారం ల్యాండ్‌ను గుర్తించాలని, డాక్యుమెంటేషన్, గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆకివీడు మండలం రీ సర్వే పనుల్లో వెనుకబడి ఉందని కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. రీ సర్వేలో భాగంగా ప్రతీ అంగుళం భూమిని గుర్తించి రికార్డు చేస్తామని, అదేవిధంగా ప్రతి రైతు జిరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయడం జరుగుతుందన్నారు. రీ సర్వేఅధికారులు, టెక్నికల్ సిబ్బంది కలిసి కట్టుగా పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తిచేసి ప్రగతిని చూపాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆకివీడు తహాశీల్దారు ఎన్.వెంకటేశ్వరరావు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరగపర్రులో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గరగపర్రు రోడ్డులో రైల్వే గేట్ నుంచి బివి రాజ్ మార్క్ వరకూ ఉన్న ఆక్రమణలను అధికారులు పొక్లెనర్‌తో తొలగించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాంతంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణ షాపులు, అలాగే పేదలు ఏర్పాటు చేసుకున్న నివాసాలను అధికారులు మంగళవారం తొలగించారు. తొలగింపు సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఆ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలోని పేదలకు కొందరికి ఇళ్ల పట్టాలు, మరికొందరికి టిడ్కో ఇళ్లు కేటాయించడంతో పాటు, పది రోజుల నుంచి ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల తొలగింపులో మున్సిపల్ అధికారులతోపాటు, ఆర్అండ్‌బి, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పొక్లైనర్లతో ఆక్రమణలు తొలగిస్తున్న వైనం

మొక్కుబడిగా ప్రజావేదిక !

పూర్తి స్థాయిలో హాజరుకాని అధికారులు

పత్తా లేని సర్పంచులు

ప్రజాశక్తి - పాలకోడేరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మొక్కుపడిగా సాగింది. ప్రజావేదిక సభ ప్రారంభించిన గంటన్నరలో తూతూమంత్రంగా నిర్వహించి అధికారులు మమ అనిపించారు. నాటిన మొక్కలు అక్కడ లేకపోయినా, రూ.7 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించినా, ఫీల్డ్ అసిస్టెంట్ల విధుల నిర్వహణ సక్రమంగా లేకపోయినా ఇలా అనేక ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు కనీసం చర్యలు తీసుకోలేదు. విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోగా కనీసం సర్పంచులు సైతం పత్తా లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో ప్రజావేదిక తూతూ మంత్రంగా ముగిసింది. దీంతో జనాల్లేక సభ వెలవెలబోయింది.

మండలంలో 2021-22లో ఉపాధి హామీ పనులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా రూ.5.38 కోట్లతో 827 పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల వారీగా వెల్లడించిన వివరాల ఆధారంగా ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 3,536 మొక్కలు నాటగా ప్రస్తుతం వాటిలో 2000 మొక్కలు మాత్రమే ఉన్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. శృంగవృక్షం, పెన్నాడ. గొరగనమూడి తదితర గ్రామాల్లో రైల్వే ట్రాక్ వెంబడి వేసిన మొక్కలను రైల్వే రెండో లైను వేయడం ద్వారా తొలగించినట్లు పేర్కొన్నారు. ఇక పంచాయతీరాజ్ శాఖ ద్వారా విస్సాకోడేరులో బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణం నిమిత్తం వచ్చిన రూ.1.26 లక్షల విలువైన సిమెంట్ ఆర్‌బికె నిర్మాణానికి వినియోగించారు. దీనికి సంబంధించి రికార్డులు చూపకపోవడంతో డ్వామా పీడీ టివి.రాజేశ్వరరావు రికవరీకి ఆదేశించారు. పనులు పూర్తి చేసిన ప్రదేశంలో పని వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయలేదని వెల్లడైంది. ఈ మేరకు ఆయా క్షేత్రస్థాయి పరిశీలకుల వద్ద నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనుల్లో రూ.7.04 లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారులు వెల్లడించారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గంటన్నరలో ముగిసిన ప్రజా వేదిక

10 గంటలకు ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు ముందుగా తెలియజేసినప్పటికీ సమయానికి ఎవరు రాకపోవడంతో 11.30 గంటలకు సభను ప్రారంభించారు. మండలంలోని 8 మంది పంచాయతీ కార్యదర్శులు ,7 మంది గ్రేడ్ 5 సెక్రటరీలు,14 మంది సర్పంచులు,19 ఎంపిటిసిలు ,19 ఫీల్డ్ అసిస్టెంట్లు, మిగిలిన అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఎవరు హాజరు కాలేదు. పెన్నాడ అగ్రహారం, గొరగనమూడి, పాలకోడేరు పంచాయతీ కార్యదర్శులు హాజరు కాలేదు. అలాగే పాలకోడేరు సర్పంచి మరియమ్మ మినహా మిగిలిన సర్పంచులు పత్తాలేరు. కేవలం నలుగురు ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీలు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. పనులు పారదర్శకంగా, నాణ్యతతో జరగాలంటే అధికారులు, నాయకుల పర్యవేక్షణ తప్పనిసరని ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ(చంటి రాజు) అన్నారు. కార్యక్రమంలో డివిఒ విజయలక్ష్మి, ఎపిడి విజయలక్ష్మి, ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావు, డిపిఎం మురళి, సాంకేతిక సహాయకుడు చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తల్లిదండ్రులు పరీక్షలకు ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ చెప్పారు. ఆదిత్య స్కూల్ 16వ వార్షికోత్సవంలో మంగళవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. కష్టపడి అభివృద్ధిలోకి వచ్చిన వ్యక్తులకు ఇచ్చే గౌరవం చాలా గొప్పదని చెప్పారు. అటువంటివారికి మన దేశం మంచి అవకాశాలను కలిపిస్తోందన్నారు. సైకాలజిస్ట్ ఎస్.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు విలువలు నేర్పాలన్నారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ఎస్.రాఘవరెడ్డి మాట్లాడారు. ప్రిన్సిపల్ ఎన్.అయ్యపరాజు పాఠశాల వార్షిక నివేదికను వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

బాలుర హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని పాలకొల్లు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.మంగతాయారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పర్యవేక్షకులకు సూచించారు.

శాస్త్రవేత్తలకు డిజిటలైజేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాబోయే రోజుల్లో శాస్త్రవేత్తలు పంట పొలంలో ఫీడ్ బుక్ డిజిటలైజేషన్ చేయనున్నట్లు మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఇన్‌ఛార్జి ఎడిఆర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉభయగోదావరి జిల్లాల శాస్త్రవేత్తలకు ఆధునికీకరణ డిజిటలైజేషన్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం వ్యవసాయ పరిశోధన సంస్థ, అంతర్జాతీయ ఫిలిప్పైన్స్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పరిశోధన బార్ కోడ్ ఉపయోగించి ఆధునికీకరణ టెక్నాలజీ ద్వారా నమోదు జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఫిలిఫైన్స్ నిర్వాహకులు పి.జానకిరామయ్య శిక్షణ కర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త సతీష్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

30న చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 30వ తేదీ నుంచి 63 రోజుల పాటు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా మార్టేరు సెంటర్లో చలివేంద్ర ఏర్పాటు చేయనున్నట్లు సంఘం అధ్యక్షులు కేకేఆర్ చంద్రశేఖర్ రెడ్డి (ఆచారి) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలకృష్ణారెడ్డి రానున్నట్లు తెలిపారు. ఈ చలివేంద్రం దాతల సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. దాతలు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, చింతా ధర్మ వీరనారాయణరెడ్డి, అల్లం భాస్కరరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, నల్లిమిల్లి వివేకానంద రెడ్డిని సంప్రదించాలని కోరారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - అత్తిలి

ఏప్రిల్ 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి మక్కా సూర్యారావు అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

ఆధార్‌లో తప్పులుంటే సరిచేసుకోండి

పాలకొల్లు రూరల్ :వెలివెల గ్రామం సచివాలయంలో మంగళవారం ఆధార్‌లో సవరణల కార్యక్రమం నిర్వహించారు. ఆధార్‌లో లోపాలు, ఫోన్ నెంబర్ లింక్ లేనివారు, పేర్లు తప్పు పడినవారు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి సేవ కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఎంతోమందికి లబ్ధిచేకూరుతుందన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి

చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, ఆ ఆహారం తీసుకోవడం ఆరోగ్యకమని అంగన్‌వాడీ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతరాణి అన్నారు. మంగళవారం మహదేవపట్నంలో పోషన్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతరాణి మాట్లాడుతూ పోషక పదార్థాలతోనే మెరుగైన ఆరోగ్యాన్ని పొందొచ్చన్నారు. విద్యార్థులందరూ పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులందరికీ రాష్ట్ర ప్రభుత్వం పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వాణి విజయరత్నం, ఎసిడిపిఒ కృష్ణకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రత్నకుమారి, అనిల్‌కుమారి, మేరీ, సుజాత, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని ఐసిడిఎస్ అధికారి ఎం.విజయ కుమారి అన్నారు. మంగళవారం సిహెచ్‌సిలో ఐసిడిఎస్ వైద్య అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - కాళ్ల



మాట్లాడుతున్న సర్పంచి సుబ్బారావు

దొడ్డనపూడి గ్రామంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుం టున్నామని గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు అన్నారు. దొడ్డనపూడి గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచి కొల్లి సుబ్బారావు మాట్లాడుతూ గ్రామంలోని మూడు తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామన్నారు. ఏటా వేసవిలో నీటి ఎద్దడి ఉండేదని, ఈ ఏడాది సమస్య పరిష్కారానికి కచ్చాగరువు నుంచి రక్షిత మంచినీటి చెరువు వరకూ నీటిని లిఫ్ట్ చేసే పనులు, పైపు లైన్ పనులు చేయాలని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. ఈ పనులు రూ.7.50 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచి నక్క వీరకృష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు కొప్పర్తి ఏసురాజు, కుంకళ్ల శ్రీనివాస్, ఇర్రింకి పార్వతీదేవి, రాగాని నరసింహమూర్తి, బొద్దు వినిత, కొల్లి కృష్ణకుమారి, చికిలే జానీ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పెంటపాడు :ఆరోగ్యవంతమైన ముర్ర జాతి పాలిచ్చే గేదె ఎకరం పొలం ఆదాయం తెస్తుందని పోస్ట్ వైద్యాధికారిని మౌనిక పేర్కొన్నారు. సోమవారం జట్లపాలెంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి ఖండవల్ల మని రాజు విచ్చేశారు. మాజీ ఎంపిటిసి కృష్ణప్రసాద్, పశు వైద్యశాల దాత జివిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై దాడి, కిడ్నాప్ కేసులో తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి - తణుకు

స్థల వివాదం నేపథ్యంలో కొందరు వ్యక్తులు ఓ వ్యక్తిపై ఈ నెల 27వ తేదీన దాడిచేసి కిడ్నాప్‌కు పాల్పడిన ఘటనలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు తణుకు ఎస్ఐ వీరబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థలం విషయంలో వీరవాసరం గ్రామానికి చెందిన చెందిన గుండా జయప్రకాష్‌నాయుడుకు, తణుకుకు కొలువూరి శ్రీరామ్‌రెడ్డికి పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీరామ్‌రెడ్డి వద్ద గుమస్తాగా పనిచేస్తున్న నడిపూడి వెంకటశ్రీనివాస్‌ను వీరవాసరం గ్రామానికి చెందిన గుండా జయప్రకాష్‌నాయుడు, సవరపు నాగసుబ్రహ్మణ్యం, మద్దాల సత్యసాయిబాబా, గ్రంధి రత్నకిషోర్, వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన కరింశెట్టి వీరవెంకట సత్యనారాయణ మూర్తి, నందమూరుగరువుకు చెందిన జవ్వాది మావుళ్లు, భీమవరానికి చెందిన కొల్లాటి జయకృష్ణ, జోడ నాగరాజు, దేవ సాయికృష్ణ కలిసి రెండు కార్లలో వచ్చి దాడి చేసి కిడ్నాప్ చేశారు. దీంతో శ్రీరామ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి దాడికి పాల్పడిన వారిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు శివారున మంగళవారం కోడిపందేల స్థావరంపై దాడి చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులో తీసుకొని, వారి నుంచి కోడి కత్తి, రూ.5500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శృంగవృక్షం శివారున పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1500 నగదును స్వాధీనం చూసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం.!

మెటల్ వేసి వదిలేయడంతో వాహనదారులు, స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల నుంచి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారి నిర్మాణ పనులు నిలిచి పోయాయి. మెటల్ వేసి వదిలేయడంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. మొగల్తూరు నుంచి కొత్తపాలెం వరకూ సుమారు నాలుగు కిలో మీటర్లు, భీమవరం గ్రామీణ మండలం పెదగరువు నుంచి జిబిటి కళాశాల వరకూ 2 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి సుమారు నాలుగేళ్ల కిందట టిడిపి హయాంలో రూ.12.64 కోట్ల నిధులు మంజూరు చేశారు. తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేసిన రివర్స్ టెండర్ విధానంలో కూడా పనులు ప్రారంభం కాలేదు. తిరిగి అవే నిధులతో రెండున్నరేళ్లకిందట పనులను ప్రారంభించారు. రహదారిని రెండు వరుసలుగా విస్తరించారు. అయితే తారురోడ్డు నిర్మించాల్సి ఉండగా మెటల్ రోడ్డు వేసి చేతులుదులుపుకున్నారు. ప్రస్తుతం రహదారిపై రాళ్లు పైకిలేచి అధ్వానంగా తయారైంది. వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



మొగల్తూరు- కొత్తపాలెం రహదారి దుస్థితి

రహదారిపై గుంతలు..

కొత్తపాలెం నుంచి వెంప వరకూ సుమారు 2 కిలోమీటర్ల మేర ఉన్న ఆర్అండ్‌బి రహదారి పూర్తిగా ధ్వంసమైంది. నిత్యం ఈ రహదారి గుండా వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ధ్వంసమైన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ఈ రహదారికి మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

నిక్కిక్రజ, ఆర్అండ్‌బి ఇన్‌ఛార్జ్ ఎఇ, మొగల్తూరు

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేందుకు తగు చర్యలు చేపడతాను. కొత్తపాలెం-వెంప గ్రామాల మధ్య ఉన్న రహదారి మరమ్మతు పనులను కూడా తొందరలోనే చేపడతాం.

పౌష్టికాహార పంపిణీకి ప్రభుత్వం కృషి

ఎమ్‌డిఎం జిల్లా సమన్వయకర్త కృష్ణారావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పౌష్టికాహారం అందించడమే జగనన్న గోరుముద్ద లక్ష్యమని ఎండిఎం జిల్లా సమన్వయకర్త కె.కృష్ణారావు అన్నారు. మంగళవారం పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపియుపి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం, రాగి జావ పంపిణీని, తాగునీరు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి అధిక ప్రాధాన్యతిస్తోందన్నారు. పోషక విలువలతో కూడిన మెనూ రూపొందించడమే కాకుండా, వారానికి ఐదు రోజులు కోడి గుడ్డు, 3 రోజులు చిక్కీ, మరో మూడు రోజులు రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తరువాత రికార్డులను పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 90 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో భాగస్వాములయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బండి ఆంజనేయులు, సిఆర్‌పి కుక్కల మంగతాయారు, దొంగ సత్యనారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎండిఎం జిల్లా సమన్వయకర్త కృష్ణారావు

విజేతలకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం

అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు, తర్ఫీదు ఇచ్చిన శిక్షకులకు నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.హర్షవర్ధన్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలు, శిక్షకులు ఏప్రిల్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు, శిక్షకులు https:///dbtyas-sports.gov.inలో దరఖాస్తును డౌన్లోడ్ చేసుకుని డిబిటి-ఎంఐఎస్ పోర్టల్ ద్వారా పూర్తి చేసి సమర్పించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హామీల అమలు ఘనత జగన్‌దే

ఎంఎల్ఎలు గ్రంధి, వాసుబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత రుణమాఫీ కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగకుండా వాలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి పరిపాలనను ఇంటి ముంగిటకు తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. భీమవరం మండలంలో మూడో విడత రుణమాఫీగా 1662 డ్వాక్రా సంఘాలకు రూ.17 కోట్ల 85 లక్షల నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి ఎస్ఎస్ఎస్.వేణుగోపాల్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఎంఎల్ఎ శ్రీనివాస్‌ను సత్కరించారు.

గణపవరం : మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు మంగళవారం వరదరాజపురంలోని కెవిపి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతిస్తున్నట్లు చెప్పారు. గణపవరం, సరిపల్లి, వాకపల్లి, కొత్తపల్లి, వరధరాజపురం, అర్ధవరం, వెలగపల్లి, కొమ్మర, వల్లూరు, గ్రామాలకు చెందిన 579 స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేందుకు సహాయ సహకారాలు అందించిందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మొగల్తూరు, రామన్నపాలెం శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాలకు చెందినటువంటి స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మూడో విడత 1566 గ్రూపులకు 17 కోట్ల 12 లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎం.సుభాషిని, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనవమి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడలో కందుల లక్ష్మణస్వామి, లక్ష్మీ తులసమ్మ దంపతులచే ప్రతిష్ఠించిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి 30వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ జరుగుతాయని మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం బొండాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల్లో నాటక రంగంలో విశిష్ట ప్రతిభ కనబర్చిన జి.రత్నశ్రీ, సత్తిబాబును సత్కరించనున్నట్లు తెలిపారు. గోనబోయిన వెంకట సత్య రాజేష్, సత్యవతి దంపతులచే భద్రాద్రి రామచంద్రస్వామి కళ్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మందపాటి వెంకన్న, అర్చకులు కప్పగంతుల లక్ష్మీనరసింహ, నందుల నారాయణమూర్తి, ఎం.రాము, మన్నే సోమేశ్వరరావు, గంగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ట్యాంకులు ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను వెంటనే ప్రారంభించి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెత్లహంపేట, హౌసింగ్ బోర్డులో ట్యాంకులు నిర్మించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రారంభించడానికి చర్యలు తీసుకోకపోవడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. ఇఒ ఈ వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకుండా తక్షణం ట్యాంకులు ప్రారంభించాలని కోరారు. ట్యాంకులు ప్రారంభించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అధికారుల తీరుకు ఖండన

సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

లంకపేటలో గరగపర్రు రోడ్డు విస్తరణ పేరుతో సుమారు వందమంది పేద కుటుంబాలకు చెందిన గృహాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పొక్లయినర్లతో అర్థాంతరంగా తొలగించిన తీరును ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. అధికారులు దౌర్జన్యంగా పొక్లయినర్లు, జెసిబిలతో ఇళ్లు తొలగించడం దారుణమన్నారు. ఇళ్లు కూల్చివేస్తున్న ప్రాంతాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. సొంత గృహాల వారికి ప్రత్యామ్నాయంగా టిడ్కో గృహాలు కేటాయించామంటున్న అధికారులు చిరు వ్యాపారులు, అద్దెకుంటున్న వారికి ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ కోర్టు స్టే ఉన్నా ఇళ్లు తొలగించడం న్యాయ వ్యవస్థను అవమానించడమేనన్నారు. పేదలకు ఇళ్ళస్థలాల నిమిత్తం నాలుగైదు ఎకరాలు భూమి కొనుగోలు చేసి ప్రత్యామ్నాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ధైర్యంగా రాసి ఉత్తీర్ణత మంచి సాధించాలని తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. మంగళవారం మానవత ఆధ్వర్యంలో సరిపల్లి విద్యా జ్యోతి కాన్వెంట్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల పట్ల విద్యార్థులు ఆందోళన చెందొద్దన్నారు. అనంతరం విద్యార్థులకు డిక్షనరీతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యా జ్యోతి కాన్వెంట్ కరస్పాండెంట్ సిహెచ్.నాగేశ్వరరావు, మానవత మండల అధ్యక్షులు రామారావు, సంస్థ కన్వీనర్ కాకర్ల వినాయక పాల్గొన్నారు.

గందరగోళంగా వేలం పాట

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక నగర పంచాయతీ ఆశీలు (పన్ను) వసూళ్ల కోసం నిర్వహించిన వేలం పాట గందరగోళంగా మారింది. నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం పది గంటలకు ఆశీర్వాదం పాటలు కోసం అధికారులు కొలువు తీరారు. ముందుగా పాటకు అవసరమైన డిపాజిట్లు సాల్వెన్సీ సర్టిఫికెట్ల పరిశీల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ క్రమంలో పోటీదారుల్లో ఒకరు సాల్వెన్స్ సర్టిఫికెట్లు ముగ్గురు పేరిట సమర్పించడంతో సమస్య మొదలైంది. మరి కొంతమంది పోటీలో పాల్గొనేవారు వ్యక్తిగత సాలవెన్స్‌లు ఉండాలే తప్ప కుటుంబ పరమైన ఉమ్మడి సాల్వెన్స్‌లు పనికిరావంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో వేలం పాటు మొత్తంవిలువ తగ్గించాలంటూ చాపల మార్కెట్ వ్యాపారులు కోరారు. నిబంధన మేరకు తాము పాటలు నిర్వహిస్తామని అధికారులు వివరించారు. అయితే తాము ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు విషయాన్ని విన్నవించామని తెలిపారు. అప్పటికే మధ్యాహ్నం రెండు గంటలు కావడంతో అధికారులు వేలంపాటలను సాయంత్రానికి వాయిదా వేసి వెళ్లిపోయారు. మోత మీద మధ్యాహ్నం 12 గంటలకు పూర్తయిపోవాల్సిన వేలంపాట సాయంత్రం 6 గంటలకు పూర్తయింది.

భారీగా పెరిగిన ఆదాయం..

నగర పంచాయతీ వేలంపాటలో విలువ పెరగడంతో ఆదాయం భారీగా పెరిగింది. గత సంవత్సరం కన్నా పాటల విలువ ఈ సంవత్సరం 19 లక్షల పైబడి దాటింది.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మొగల్తూరు:ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ విమర్శించారు. మంగళవారం మొగల్తూరులోని పడమటిపాలెం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, జక్కం బాబ్జీ, వాతాడి కనకరాజు, మారాజు, దూది బాబు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం

తాడేపల్లిగూడెం :పేదవాడి ఆకలిని తీర్చేందుకే అన్నా క్యాంటీన్ అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. వరుసగా 30వ మంగళవారం స్థానిక తాలూకాఫీస్ సెంటర్లో అన్నా క్యాంటీన్ వద్ద కృష్ణయపాలెం గ్రామానికి చెందిన ముత్యాల నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

తూతూమంత్రంగానే ఎంపెడా సమావేశం!

తక్కువ మంది రైతుల హాజరు

ప్రజాశక్తి - ఆకివీడు

రొయ్యల రైతుల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ఎంపెడా సమావేశానికి ఈ సారి రైతులు అంతంతమాత్రమే హాజరయ్యారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఎంపెడ (సముద్ర ఉత్పత్తుల ఎగుమతిల అభివృద్ధి సంస్థ) రొయ్యల రైతుల కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. అయితే ఈ సమావేశానికి రైతులు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. చేసేది లేక అధికారులు సమావేశాన్ని మమ అనిపించారు. భీమవరం సాహసంచాలకులు డాక్టర్ గోపాల్ ఆనంద్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆకివీడు, కాళ్ల, కొల్లేరు వీర ప్రాంతం సరిహద్దులను కృష్ణాజిల్లా ప్రాంతానికి చెందిన సుమారు 2000 మందికి పైగా రైతులు ఉన్నారు. ఇక్కడ వంద మంది కూడా హాజరుకాని పరిస్థితి. సమాజంలో రైతులకు సూచనలిచ్చేందుకు వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకినాడ నుండి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే రొయ్యల పరిశోధనా కేంద్రం అధికారులు సూటబుల్ ఆక్వా కల్చర్ ఎన్ఎసిఎస్ఎ కార్యనిర్వహణాధికారి డి.ఎక్కా, కెవికె శాస్త్రవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ అధికారులు అనేకమంది ఉన్నత నిపుణులు హాజరయ్యారు.

అధికారులకు ముగిసిన శిక్షణ

విస్సాకోడేరు సర్పంచి శ్రీనివాస్‌కు అభినందన

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా విస్సాకోడేరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆ గ్రామ సర్పంచి బొల్లా శ్రీనివాస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ కేంద్రాన్ని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మొదట విడతలో కొన్ని గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఇక్కడ శిక్షణ తీసుకున్నారు. రెండో విడతలో ప్రారంభమైన శిక్షణను జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించారు. దీనిలో భాగంగా నాలుగు రోజుల నుంచి ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద ఏడు మండలాలకు చెందిన 42 గ్రామ పంచాయతీలకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెన్స్, క్లాప్ మిత్రలు, సచివాలయ సిబ్బంది శిక్షణ తీసుకున్నారు. డిపిఆర్‌సి టెక్నికల్ కోఆర్డినేటర్ ఎన్ ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణకు వచ్చిన వారికి సర్పంచి బొల్ల శ్రీనివాస్ భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలూ కల్పించారు. సర్పంచి శ్రీనివాస్‌పై అభినందించారు.

హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఉండి

వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ కె.గంగాధర్‌రావు సూచించారు. మంగళవారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్లో నిర్వహించిన హెల్మెట్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడారు. హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా చూసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నుంచి హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వాహనదారులకు జరిమానా విధించకుండా హెల్మెట్ తెచ్చుకుని వాహనం తీసుకుని వెళ్లాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఒ.శ్రీనివాస్, కె.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి కుర్చీలు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లెలో భవిత కేంద్రానికి జువ్వలపాలెం మెయిన్ స్కూల్ ఉపాధ్యాయుడు బిఆర్ఎంకె స్వామి కుర్చీలను మంగళవారం బహూకరించారు. బొబ్బిలి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బిఆర్ఎంకె.స్వామి రూ.4 వేల విలువైన ఆరు కుర్చీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఇ కోఆర్డినేటర్ ఎంఎన్.శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ ఐఇ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

45 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - ఉండి

నేత్ర సమస్యలతో బాధపడేవారికి వైద్యం అందించడమే వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం లక్ష్యమని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. మంగళవారం ఎన్ఆర్‌పి అగ్రహారం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్నుద్దేశించి సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడారు. సుమారు 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కళ్లజోళ్లు, 20 మందికి ఆపరేషన్లు అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

మే 1 నుంచి వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకూ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నామని క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎండి మెహర్‌రాజు, చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కేంద్రాల్లో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి ఆసక్తి గల క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 9908267811 సంప్రదించాలని కోరారు.

రెండో రోజుకు సిపిఐ నేతల దీక్షలు

భీమవరం : రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం అని, ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఒనగూరే ప్రయోజనం శూన్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా నిర్మించాలని సిపిఐ చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ప్రాజెక్టు ఎత్తు తగ్గించరాదని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరదలు, తుపాన్ల నుంచి పంట ముప్పు నివారణ అనేక ప్రయోజనాలు ఇమిడి ఉన్న ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే అది బ్యారేజీ అవుతుంది తప్ప బహుళార్థక ప్రాజెక్టు కాదని, పూర్తి ప్రయోజనాలు సిద్ధించవని గుర్తు చేశారు. దీక్షలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు, సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.